క్లుప్తంగా

రేపు సెమీ క్రిస్మస్ వేడుకలు

కల్వకుర్తి టౌన్: పట్టణంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు అన్ని సిద్ధం చేసినట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, సెక్రెటరీ జాన్ రామస్వామిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పట్టణంలోని మానస గార్డెన్స్‌లో నిర్వహించే వేడుకలకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. క్రిస్మస్ కానుకలను ఎమ్మెల్యే అందిస్తారని తెలిపారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఉమాశంకర్

కొల్లాపూర్: పట్టణంలో ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్‌గా ఎస్ ఉమాశంకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బస్‌భవన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. కొల్లాపూర్ డీఎంగా పని చేస్తున్న రాజేశ్వర్ బస్‌భవన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన డీఎం మాట్లాడుతూ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఏసీబీ ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్: ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏసీబీ అధికారులకు సంబంధించిన ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ చారగొండ బాబు కోరారు. మంగళవారం ఆయన పోలీసుస్టేషన్, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే వెంటనే ఏసీబీ అధికారులకు ఫోన్ చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని విన్నవించారు.

మంత్రి పదవి ఇవ్వాలి



చారకొండ: అచ్చంపేట్ ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ బ్లాక్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. 20 ఏళ్లుగా పార్టీని బలోపేతం చేస్తూ కార్యకర్తలతో మమేకమై ఎమ్మెల్యే నిస్వార్థంగా సేవలు అందించారన్నారు. మంత్రి వర్గంలో ఎమ్మెల్యేకు చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీటీసీ లక్ష్మణ్, శ్రీనివాసులు వెంకటయ్య గౌడ్, హన్మంతు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎస్ఐపై ఫిర్యాదు

కొల్లాపూర్: పట్టణానికి చెందిన బాలరాజు ఎస్ఐ బాలవెంకటరమణపై మంగళవారం ఏఎస్ఐ రామస్వామిగౌడ్‌కు ఫిర్యాదు చేశాడు. గతేడాది ఆగస్టు నెలలో తనను ఎస్ఐ అక్రమంగా అదుపులోకి తీసుకొని దూషించారని వివరించారు. విచారణ చేసి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత




కందనూలు: మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎం బిచ్చారావు మృతిచెందారు. మంగళవారం ఎస్‌బీఐ నాగర్ కర్నూల్ మెయిన్ బ్రాంచ్‌లో బాధిత కుటుంబసభ్యులకు ప్రమాదబీమా రూ.15 విలువగల చెక్కును జోగులాంబ రీజనల్ మేనేజర్ వెంకటరమణ అందజేశారు. అదే విధంగా స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీ ఎస్‌జీఎస్పీ ఖాతా కిందకు మారితే ఖాతాదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో శాఖ నిర్వాహక అధికారి కే గురు ప్రసాద్, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం నిర్వహించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించాలని ఆ సంఘం జిల్లా నాయకుడు కోట్ల గౌతం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నాగర్‌కర్నూల్‌లో దివ్యాంగుల శాఖ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఉందా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయని వివరించారు. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని, విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలు కొనసాగించాలని తెలిపారు.

న్యుమోనియాపై అవగాహన కల్పించాలి



వీపనగండ్ల: గ్రామాల్లో న్యుమోనియా నివారణపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు న్యుమోనియా నివారణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులపై సర్వే నిర్వహించి వ్యాధి తీవ్రతను గుర్తించాలని, అవసరమైన వారికి మందులను పంపిణీ చేయాలని సూచించారు.

నిరీక్షణ ఫలించేనా?

- పోడు భూముల రైతులకు తప్పని తిప్పలు
- దశాబ్దాలుగా దళితులు ఎదురుచూపులు



కుడికిల్లలో దళితులు సాగు చేసుకున్న పోడు భూమి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నలమల్ల అడవి సమీపంలో ఉన్న కుడికిల్ల, నార్లాపూర్, ముక్కిడిగుండం, మొలచింతలపల్లి, ఎర్రగట్టు బొల్లారం తదితర గ్రామాల్లో పోడు భూములను దళితులు సాగుచేసుకుంటున్నారు. 50 సంవత్సరాల నుంచి అడవికి సంబంధించిన భూమిని చదును చేసుకొని సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. నేటి వరకు సాగులోనే ఉన్నా పట్టాలకు నోచుకోలేదు. గత ప్రభుత్వాలకు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ఫలించలేదు. దీంతో సాగులో ఉన్న దళితులు నానా అవస్థలు పడుతున్నారు. ఫారెస్టు అధికారులు నిత్యం భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పోడు భూములు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు చేసుకుంటున్న భూమిలోకి వచ్చి మొక్కలు నాటుతామని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రతిఘటిస్తే కేసులు కూడా నమోదు చేస్తు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఐదు నెలల కిందట ఫారెస్టు భూములను శిస్తూ చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలిచ్చారు. కాని దళితులకు ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కుడికిల్ల గ్రామానికి చెందిన దళిత రైతులు మలబస్వాపురం శివారులో 60 సర్వే నెంబర్‌లో దాదాపు 120 ఎకరాలు, 60 కుటుంబాలకు చెందిన దళిత రైతులు సాగు చేసుకుంటున్నారు. మొలచింతపల్లి, ఎర్రగట్టు బొల్లారం దళితులు కూడా వందల ఎకరాలలోనే శిస్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దళిత రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు.

పట్టాలిచ్చి ఆదుకోవాలి

50 సంవత్సరాల నుంచి నార్లాపూర్ సమీపంలో ఉన్న మలబస్వాపురం శివారులో పోడు భూమిని సాగు చేసుకుంటున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా పట్టాలు ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి.

– బిచ్చయ్య, రైతు, కుడికిల్ల

న్యాయం చేయాలి

కొన్ని సంవత్సరాలుగా ఎర్రగట్టు దగ్గర ఉన్న బొల్లరంలో పోడు భూమిని సాగు చేస్తున్నాం. పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో కృష్ణానదిలో గ్రామం నీట మునిగింది. నిర్వాసితులమైన దళితులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలి.

– చింటు, రైతు, బొల్లారం

అయోధ్య రాముడి అక్షింతలు ఊరేగింపు



పెద్దకొత్తపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయం నుంచి శ్రీరామ దేవాలయం వరకు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు, పాదుకలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీహెచ్‌పీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, భీమేశ్‌రెడ్డి, శోభారాణి, రఘుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్ననూర్: అయోధ్య శ్రీరామ అక్షింతలు భక్తులకు అందుబాటులో ఉంచామని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, అమ్రాబాద్ మండల కేంద్రంలోని అమరేశ్వర ఆలయం, పదర మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో అక్షితలు భక్తులకు అందుబాటులో ఉన్నాయన్నారు. 22న స్వామివారి శోభాయాత్రకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ రెడ్డి, శ్యాంసుందర్, శ్రీనివాస్, శ్రీనివాస చారి పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో అయోధ్య రాముడి అక్షింతలు, కలశంను హనుమాన్ విగ్రహం నుంచి నెహ్రూ చౌరస్తా, బస్టాండ్, అంబేద్కర్, గాంధీ, జగ్జీవన్ చౌరస్తాల మీదుగా, ప్రధాన పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాలయం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమాపతి ఆచార్యులు, రామాచారి, రవి, శ్రీను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను కాపాడుతా



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ: ఆంజనేయస్వామికి సంబంధించి భూములను కాపాడుతానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఊర్కొండపేటలోని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు రేవల్లి గ్రామానికి చేరుకొని కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు అయూబ్ పాషా అనిరుధ్‌రెడ్డి గెలుపొందితే కాలినడకన ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయస్వామికి మొక్కుకున్న సందర్భంలో వారికి మద్దతుగా ఎమ్మెల్యే కాలినడకన కాంగ్రెస్ నాయకులతో కలిసి రాగా.. ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా ఊర్కొండపేట స్టేజీ వద్ద కొండపై ఉన్న దర్గాన్ని సందర్శించారు. అలాగే ఇప్పపహాడ్, జకినాలపల్లిలో గ్రామ దేవతలను దర్శించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన భూములను వెంటనే సర్వే చేసి బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆలయ భూములు కబ్జాకు గురైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిఖిల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి సమీ, జకినాలపల్లి సర్పంచ్ అనిల్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ నర్సిరెడ్డి, నాయకులు గోపినాయక్, మల్లేష్, శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, వహీద్, ఆదినారాయణ, ప్రవీణ్‌రెడ్డి, కైసర్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న అమ్రాబాద్ తహసీల్దార్ శ్రీకాంత్

అమ్రాబాద్: పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిద్దామని తహసీల్దార్ శ్రీకాంత్ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో మంగళవారం అమ్రాబాద్, పదర మండలాల బీఎల్ఓలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. ఓటరుగా దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో తబితారాణి తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా తప్పొప్పుల సవరణ

వెల్దండ: పకడ్బందీగా ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణ చేయాలని తహసీల్దార్ రవికుమార్ బీఎల్ఓలకు సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వారిగా ఓటర్ లిస్టులను పరిశీలించారు. ఓటరు జాబితాల్లో మరణించిన వారిని తొలగించాలన్నారు. ఇంటిపేర్లు, వయస్సు, ఓటరు పేర్లలో తప్పులను సరిచేయాలన్నారు. ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌ను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనువాసులు, ఆయా గ్రామాల బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.

కోడేరు: ఓటరు జాబితాల్లో తప్పులు లేకుండా సరి చేయాలని డిప్యూటీ తహశీల్దార్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్ఓలు స్వాతి, వరలక్ష్మి, లక్ష్మి, నాగమణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం యంగ్ ఎర్త్ లీడర్ అనే అంశంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కౌన్సిల్ ఫర్‌గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షుడు లీలా లక్ష్మారెడ్డి అవగాహన కల్పించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ ప్రభుత్వం, కౌన్సిల్ ఫర్‌గ్రీన్ రెవల్యూషన్ సౌజన్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు నిలిపివేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగులలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ నాణ్యత లేకుండా చేపడుతున్నారని, పైపుల సైజ్ చిన్నగా ఉన్నాయని గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ ఫిర్యాదు చేశారు. ఈ మేరక ఆయన మంగళవారం పనులను పరిశీలించారు. ఈ విషయాన్ని డీపీఓ డీటీఓ డివిజన్ ఇంజనీర్‌కు ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. ఇంజనీర్ సూచన మేరకు పనులు నిలిపివేయాలని కార్యదర్శి శ్రీనివాస్‌కు ఆదేశించారు.

పాదయాత్ర ప్రారంభం



అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యేగా డాక్టర్ వంశీకృష్ణ గెలిస్తే అచ్చంపేట నుంచి శ్రీశైలం వరకు పాదయాత్ర చేస్తామని యూత్ కాంగ్రెస్ నాయకులు మొక్కుకున్నారు. ఈ మేరకు మంగళవారం యువకుల చేపట్టిన పాదయాత్రను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఆయన సతీమణి అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ జెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్రగా వెళ్లిన వారిలో యూత్ కాంగ్రెస్ నాయకులు నర్సింహా, వినోద్, వాసు నాయక్, మధు మిత్రబృందం సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గౌరీశంకర్, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్, ఖాదర్, పవన్, శివ, రంగయ్య, శ్రీనివాస్, వెంకటేష్, చందర్ పాల్గొన్నారు.

నర్సరీలపై శ్రద్ధ

అమ్రాబాద్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఎంపీఈఓ వెంకటయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మాదవానిపల్లి, తిర్మలాపూర్(బీకే) గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో పలు రికార్డులను తనిఖీ చేశారు. నర్సరీల మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం చేయొద్దని నిర్వాహకులకు సూచించారు.

వాచర్లకు రూ.10 లక్షల జీవిత బీమా



మన్ననూర్: అటవీ శాఖలో విధులు నిర్వహిస్తున్న వాచర్లకు రూ.10 లక్షల జీవిత బీమా పాలసీ ధ్రువ పత్రాలను మంగళవారం అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్ క్షతిజ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు 243 మంది ఫారెస్టు వాచర్లకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ విశాల్, ఎఫ్ఆర్‌ఓలు ఆదిత్య, గురుప్రసాద్, డీఆర్ఓ రవికుమార్, రామాంజనేయులు, గురువయ్య, పర్వతాలు, బాబలి, బాలయ్య, నర్సింహ్మా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమ్రాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023, 24 సంవత్సరానికిగాను అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్(1) తెలుగు(1), వృక్షశాస్త్రం (1) పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టులలో పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. ఆసక్తి గలవారు బుధవారం నుంచి ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఈ నెల 25న నిర్వహించే మహా పడిపూజకు రావాలని అయ్యప్ప భక్తబృందం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. అయ్యప్ప మాలధారులు శ్రీనివాస్, రవి, ఆంజనేయులు, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాహుల్ తదితరులు ఉన్నారు.

ఈకేవైసీకి బారులు తీరిన మహిళలు



పెద్దకొత్తపల్లి: ఆరు గ్యారంటీలలో రూ.500లకే సిలిండర్ అందిస్తామని పథకం ఉండటంతో గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీకి కోసం బారులు తీరుతున్నారు. ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ కోసం ఈకేవైసీ చేయించుకోవడం కోసం గ్యాస్ ఏజెన్సీ వద్ద మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి క్యూలో నిల్చుంటున్నారు. మండలంలోని 28 గ్రామాలకు ఒకే ఏజెన్సీ ఉండడం వలన అన్ని గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గంటల తరబడి గోదాంవద్ద క్యూలో నిలబడి నిరీక్షించక తప్పడం లేదు. ప్రభుత్వం ఈకేవైసీ నమోదు కోసం ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్ట గడువు, ఎలాంటి విధివిధానాలు ప్రకటించకపోయినా వినియోగదారులు తెలిసి తెలియక గోదాంల వద్దకు పరుగులు తీస్తున్నారు.

రామాలయంలో పూజలు

కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో ధనుర్మాసం పురస్కరించుకొని మంగళవారం గోదాదేవి, రంగనాథస్వామిలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు తిరుప్పావై సేవలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. పూజా తదితర కైంకర్యాలను ఆలయ భక్త బృంద కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

డ్రమ్‌సీడర్ వరిసాగుపై అవగాహన



ముక్కిడిగుండంలో రైతులకు అవగహన కల్పిస్తున్న అధికారులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రైతువేదికల్లో ఆయా గ్రామాల రైతులకు మండల వ్యవసాయ అధికారి నాగరాజు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, డ్రమ్ సీడర్ పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరినాటే విధానాన్ని వివరించారు. ఖర్చు తగ్గుతుందని, అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. పంట 12 నుంచి 14 రోజులు ముందుగానే కోతకు వస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని సిర్సవాడ, ఐతోలు, చర్ల ఇటిక్యాల గ్రామాల్లో రైతు వేదికల్లో డ్రమ్ సీడర్ టెక్నాలజీ వరిసాగుపై మంగళవారం ఏఓ సాయిరమేశ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. వరిసాగు విధానంలో మెళకువలు పాటిస్తే మంచి ప్రయోజనాలు ఉంటాయన్నారు. అల్లాపూర్, చర్ల ఇటిక్యాల గ్రామపంచాయతీలలో డ్రమ్ సీడర్ పరికరాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒకరోజుకు రూ.250 చెల్లించి అద్దెకు తీసుకోవచ్చన్నారు. వ్యవసాయంలో వస్తున్న ఆధునిక పద్ధతులను అవలంభించాలని కోరారు. పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శివప్రసాద్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



అల్లాపూర్‌లో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాడూరు: మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి, అల్లాపూర్ గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ గంగమోహన్ ఉపాధి పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ఉపాధి పథకం ద్వార గతంలో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలించి ఈత మొక్కలను నాటాలని సూచించారు. పనులకు కూలీల సంఖ్యను పెంచాలని పనుల పట్ల కూలీలకు అవగాహన కల్పించి నర్సరీల నిర్వహణ వివిధ అంశాలకు సంబంధించిన వివరాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిరంజన్, ప్రవీణ్‌రెడ్డిలకు వివరించారు. అదే విధంగా గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డులు జిల్లా స్థాయి అధికారులు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లు ఉన్నారు.

గణిత మేధావి రామానుజన్ జీవితం ఆదర్శం



అరుణ్ కుమార్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కందనూలు: గణిత మేధావి రామానుజన్ జీవితం ఆదర్శమని వివేకానంద అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ అన్నారు. రామానుజన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో రామానుజన్ ది మ్యాన్ ఆఫ్ ఇన్ఫినిటీ అనే అంశంపై మోటివేషనల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ రామానుజన్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామానుజన్ జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన జితేందర్ రెడ్డి, శివరాం, అయిజాజ్ షరీఫ్, మెహబూబ్ లకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ యం.సుంకన్న, కళాశాల కో ఆర్డినేటర్ రాఘవేందర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీలపై నిర్లక్ష్యం వహించొద్దు



వెల్దండ: నర్సరీలపై నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని గుండాల, ఉబ్బలగట్టుతండా, పోషమ్మగడ్డ తండాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలను, డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీల రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను సక్రమంగా ఉండే విధంగా కార్యదర్శులు చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రతి అంశాలను రికార్డులో నమోదు చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలను రక్షించాలన్నారు. నర్సరీలో పెంచే మొక్కలను సక్రమంగా ఉండే విదంగా చూడాలన్నారు. ప్రతి నర్సరీల్లో 10వేల మొక్కల పెంపకం ఉండే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, కార్యదర్శులు, టీఏలు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీపీఐ నాయకులు



ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీని సీపీఐ పట్టణ కార్యదర్శి కపిలవాయి గోపిచారి, మండల కార్యదర్శి మర్యాద వెంకటయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛ అందజేసి సన్మానించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు కొత్త రామస్వామి, కొత్ర శేఖర్, సుధాకర్, ఆంజనేయులు, పరుశరాములు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకుందాం



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

వెల్దండ: ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకుందామని గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో గౌడ కులస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మండలంలోని ఎర్రవల్లి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పబ్బు పెద్దయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పర్వతాలుగౌడ్, రామచంద్రయ్యగౌడ్, కోశాధికారిగా రాజుగౌడ్, లఖిలాష్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా పెద్దయ్యగౌడ్, ప్రచార కార్యదర్శులుగా వెంకటేష్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గౌడ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడ్, మధన్‌గౌడ్, శ్రీనుగౌడ్, భరత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.